# 3. అగ్ని పరీక్ష

తలుపుకొట్టిన శబ్దం వినపడగానే "ఎవరూ?" అన్నాడు మధు, ఆ అర్ధరాత్రి తనకోసం వచ్చేదెవరా అని ఆలోచిస్తూ.

సమాధానం రాలేదుకాని, తలుపు, మరి రెండు దెబ్బలకు గురైంది. మధు విసుక్కుంటూలేచి లైటు వేసి, తలుపు తెరిచాడు. తలుపుచాటున శ్రీదేవి కన్పించటం అతనికి ఆశ్చర్యమే అయింది. నిద్రకళ్ళను తుడుచుకుంటూ ఆమెను తేరిపార జూచాడు. ఆమె గుమ్మానికి ఆనుకొని నిలబడి నీరసంగా నిట్టూరుస్తోంది. ముఖమంతా ఎర్రబడి ఉబికి– జుట్టు చిందరవందరగా పడివుంది. ఆమె మూర్తి తీవ్రమైన సమస్యతో వేగిపోతూ, అమితబాధకు గురైందని ఆమెను చూడగానే మధుకు స్ఫురించింది. సాయంత్రం తనతో కులాసాగా మాట్లాడి, తను నవ్వుతూ తనతో తనను కలుపుకొన్న శ్రీదేవికి యీ కొద్దిగంటల్లోనే ఏ మాపద వచ్చిందో!

"ఎవరు–శ్రీ?" అన్నాడు ఆశ్చర్యంతో.

"ఊఁ" అంది గాద్గదికతతో.

"అలా వున్నావేం?... ముందు లోపలికిరా–" అంతవరకూ తమను వీధిలో తిరిగే ఎవరైనా చూసిపోతారేమోనని కూడా స్ఫురించలేదు.

ఆమె అనుమానిస్తూ ముఖమైనా ఎత్తకుండానే మెల్లిగా గదిలోకి ప్రవేశించింది: మధుకు అనేక ఆలోచనలు కలిగినై. అర్ధరాత్రి సమయాన, కన్యగా వ్యవహరింపబడుతూ, కొద్ది కాలంలోనే వధువవ్వాల్సిన శ్రీదేవి – ఎంత పరిచయమూ, స్నేహితమూ ఉన్నా తనలాటి పరాయి పురుషుడి గదికి సాహసించి వొచ్చేందుకు ఏ ప్రబల కారణమో ఉండాలి!

తలుపు గడియవేసి, ఆమె కూర్చున్న కుర్చీకింద నేలమీద పరిచివున్న తివాచీమీద ఆమె పాదాల దగ్గరగా కూర్చుంటూ లాలనగా, "శ్రీ! ఎందుకూ బాధపడుతున్నావ్?" అన్నాడు.

ఆమె చీరె చెరుగుతో వాడిన ముఖాన్ని తుడుచుకొని ఇంకా నేల చూపుల్నే చూస్తోంది. మధు మంచినీళ్ళ గ్లాసును అందిస్తూ, "చాలా అలసినట్టున్నావ్- మంచినీళ్ళు తాగు-" అన్నాడు.

ఆమె మాట్లాడకుండా నీళ్ళు తాగి, గ్లాసును పక్కటేబిల్ మీద పెట్టి దీనంగా మధు వైపు చూసే మేకపిల్లలాగు, 'ఈ ఆపదలోంచి నన్ను కాపాడవూ?' అన్నట్టు చూసింది.

"శ్రీ- సంగతేమిటో చెప్పవూ?' అన్నాడు బతిమాలుతూన్నట్టు.

ఆమె ఒక నిమిషం ఆగి, "చెప్పేందుకే వొచ్చాను. కాని...." అని అతని ముఖంలోకి చూసింది.

"ఎందుకూ అనుమానంగా మాట్లాడుతావ్? ఏ పరమ రహస్యమైనా నా నోటి వెంట బైటపడదని నీకు తెలియదూ?"

"తెలుసు... మధూ! చెప్పు... నిజంగా నువ్వు నన్ను ప్రేమిస్తున్నావా?"

"ఏమిటి యీ మాటలు శ్రీ?" అన్నాడు ఆమె హస్తాన్ని మెల్లిగా నిమురుతూ.

"నన్ను నిజంగా వివాహమాడుతావా?"

"నీ ఇష్టమైతేగా?"

"ఇన్నాళ్ళూ తేల్చుకోలేక పోయాను. కాని యీ రాత్రి నిర్ధారణ చేసుకొన్నాను- నీ భార్యను అవ్వాలని..."

మధు సంతోషంతో, "నా అదృష్టదేవత యీనాడు తన నవ్వు ముఖాన్ని నాకు చూపించింది! ఏ సమస్యతోనైతే ప్రతీరాత్రీ వేగిపోతున్నానో అది ఇకముందు జీవితంలో రాదు... ఇది నిజమా? నమ్మనా శ్రీ?" అన్నాడు.

"నీ దగ్గర అబద్ధమాడుతానా? కాని..."

"ఎందుకు నీకా అనుమానం?"

"నిజంగా - చేసుకుంటావా?"

"నిజంగా - దైవంతోడు-"

"కాదు మధూ? స్నేహితంలో యీ క్షణాన నా అందానికి మోసపోయి అలా అంటున్నావ్!"

"ఎందుకూ ఇవ్వాళ నా కోసం గంపెడు అనుమానాన్ని మూట కట్టుకొచ్చావ్?"

"నీ హృదయం నాకు తెలుసు... కాని క్షణక్షణానికీ రంగులు మార్చుకొనే మానవస్వభావం నన్ను అపనమ్మకంలోకి లాగుతోంది."

"అదే సరిగ్గా చెప్పు–" అన్నాడు. "అర్థమైతే నన్ను క్షమించగలవా మధూ?"

ఆమె ఎందుకంత దీనమైన కంఠాన్ని ఉపయోగించి తనను అర్థిస్తుందో తెలియక, "నేనా నిన్ను క్షమించేది? ఏమిటి శ్రీ– వింతగా మాట్లాడుతున్నావ్?" అన్నాడు.

"క్షమించవా?"

"ఆ అధికారం నాకు ఎక్కడ వుంది?"

"ఉన్నది– నేనే ఇస్తున్నాను. కాబొయ్యే భార్యాభర్తలం భావిజీవితంలో బాధపడితే ఏం లాభం?... చెప్పు... నన్ను క్షమిస్తావా?"

తల ఆడించాడు. ఆమె అమాయకత్వానికి నవ్వుకుంటూ.

"ఎంత గొప్పతప్పయినా!"

"ఆఁ"

"చెప్పనా?"

"తప్పకుండా–"

"విన్నాక, మనసు మార్చుకుంటావేమో?"

"నా మనస్సును నమ్మలేవా!"

ఏదో అతి ప్రమాదకరమయిందీ, వినే వ్యక్తి హృదయాన్ని క్షణాల మీద భేదించగలిగేదీ– అయిన వార్తను చెప్పవలసి వచ్చినప్పుడు – ఆ వ్యక్తి పొందే ఆరాటమంతా శ్రీదేవి ముఖంలో గోచరించింది. ఒక్కసారి మధు ముఖంలోకి చూసింది. 'నేను అన్నిటికీ సిద్ధంగానే ఉన్నాను' అన్నట్టు అతను నిశ్చలంగా చూస్తున్నాడు. ఆమె నేలచూపుల్ని చూస్తూ, చెప్పేది తను కాదన్నట్టే సాగింది–

## 2

"నువ్వు నాకు ఎంత ఆప్తుడుగా ఉన్నావో– హరికూడా అంతే! ఇదివరకు ఇద్దరూ కలిసి మా యింటికి వచ్చినప్పుడు, ముగ్గురమూ కలిసి కులాసాగా మాట్లాడుకుంటూ– అనేక సాయంత్రాల్ని గడిపాం. కాని గత నాలుగు నెల్లనుంచీ నువ్వులేని వేళల్లో – హరి మా ఇంటికి రావటం జరుగుతోంది. అప్పుడు నేను అతన్ని ఏవిధంగానూ అనుమానించలేక పోయ్యాను.

ఒక రాత్రి తొమ్మిదిగంటలకు అతను వచ్చి సినిమాకు వెళ్దామని అన్నాడు. నీకు తలనొప్పిగా వుంది రానన్నావని బొంకాడు. నమ్మి మే మిద్దరమే సినిమాకు బయలుదేరాం.

జట్కా బీచిరోడ్డున వెళ్ళటం చూసి, "సినిమాకు కాదా వెళ్ళేది?" అన్నాను.

అందుకు హరి నవ్వుతూ, "ఇంకా చాలా టైం వుంది... కాసేపు సముద్ర తీరాన కూర్చొని వెళ్దాం-" అన్నాడు. నేను మాట్లాడలేదు.

బీచివొడ్డున - దూరంగాఉన్న ఇసుకతిన్నెలపైన జేరాం. చంద్రుడు వెన్నెల కాంతితో సముద్రుణ్ని లోనికి చూపుతున్నాడు. సముద్రుడు తనకు ప్రపంచంతో పని పట్టనట్టే- ఎప్పటిలాగు సంతోషంతో తరంగాల్ని ఒకటొకటిగా ఒడ్డున జేరుస్తూ పాటలు పాడుతున్నాడు. ఒడ్డున ఏర్పడే నురుగులో చంద్రుడు ప్రతిఫలించి, 'నా రూపాల్ని చూడు' అంటున్నాడు.

చలిగాలి వీస్తోంది. ఎంత హాయిగా వుందీ ఆ ప్రకృతి! లోకాన్నీ, జీవితాన్నీ మరిచిపోయి తల పట్టనన్ని కొత్త ఊహల్తో - గదుల్లో, పట్టణవీధుల్లో, బజారుల్లో, కాలేజీల్లో, ఆఫీసుల్లో తట్టని- ఊహలు ఆలోచనే చొరని ఊహలు - నాలాగే అతనిలో పని చేస్తోన్నవి కాబోలు! అంత అందమైన వెన్నెలరాత్రి, ఆ సన్నని చలిగాలీ, ఆ ప్రకృతి ఎందుకో అర్థమవక ఆరాటపడుతూన్న హృదయంలో - ఏమూలనో ప్రకృతి లిఖించిన సౌఖ్యమొకటి మూలుగుగా విన్పించసాగింది.

నా ముఖకళను గ్రహించి కాబోలు, హరి నా ముఖంలోకి చూస్తూ నవ్వాడు; అది మామూలు నవ్వు కాదు; ఎన్నెన్నో అంతరార్థాలతో, మాటలు చెప్పలేని భావాల్ని వ్యక్తపరిచే మధురమైన నవ్వు!

"ఏమిటీ?" అన్నాను.

"జాబిల్లి చల్లని చూపుల్లో అందమైన సౌఖ్యాలు వృథా అవుతున్నయ్-" అన్నాడు.

ఆ మాటలకు నవ్వాలనిపించింది. ఎలా నవ్వాలో నాకు తెలియదు.

"యవ్వనమంతా వృథాపోతే?" అన్నాడు. నేను ఆశ్చర్యపడ్డాను. ఇలాటి భావాల్ని మాటలద్వారా అతను నాలో మేల్కొల్పుతున్నాడు. శరీరాకృతీ, హృదయారాటమూ, వింతవింత కోర్కెలూ, చవిచూడని సౌఖ్యమూ - ఎన్నో నాపైన తిరుగుబాటు చేసినై.

హరి మెల్లిగా నాచేతిని పట్టుకొని గట్టిగా ఒత్తాడు. శరీరమంతా గగుర్పొడిచింది. నేను కోరుతూన్న సౌఖ్యమేమిటో అర్థమైనట్టు చూశాడు.

"ఏమిటి హరీ?" అన్నాను- నాలో మిగిలిన కొద్దిశక్తినీ ఉపయోగించి.

అతను సమాధానం చెప్పలేదు. నన్ను దగ్గరకు లాక్కొన్నాడు. ఇదికూడదని నాకెవరో బోధిస్తున్నారు: కాని హరి నా ఉద్రేకాన్ని రెచ్చగొట్టగలిగి నన్ను ఆ

కామాంధకారంలోకి లాక్కుపోయి, గుడ్డిదాన్నిగా చేసి నాకు ఇష్టం లేని పనిని చేయించ గలిగాడు. అతను ఏం చేసినా మాట్లాడలేకపొయ్యాను– ఇష్టముండి కాదు; ఆ క్షణాల్లో ఏదో ప్రకృతి శక్తులకు బద్ధురాల్నయి ముడివిడని ఉరితాటిలో మెడను దూర్చాను.

తెల్లవారు జామును జట్కాను పిలిచి నన్ను వెళ్ళమన్నాడు. ఆ సముద్రుడు నన్ను చూసి హేళనగా ఘోషించాడు. ఆ చంద్రుడు తెల్లబోయి చూస్తున్నాడు. ఆ ప్రకృతి శక్తులు నా గతికి నవ్వుతున్నాయ్. ఎలా ఇల్లు జేరానో నాకు తెలియదు–"

## 3

ఇక మాటలు చెప్పటం మాని, ఆమె భోరున ఏడ్వ మొదలిడింది.

మధు నవ్వి, "అయిందా చెప్పటం?" అన్నాడు.

అతని ముఖంలో గమనించదగ్గ మార్పేమీ లేకపోవటం చూసి ఆమె ఆశ్చర్యపడ్డది.

కాస్త ఆగి మళ్ళీ మొదలుపెట్టింది, "అంతతో పోలేదు– మధూ! ఆ నీచుడు నన్ను అనుభవించాక తనకు నాతో ఎట్టి సంబంధమూ లేదన్నట్టు ప్రవర్తించాడు... నేను ఆ తప్పుకు ఎంత విచారించాననుకొన్నావ్?–"

ఆగి నిట్టూర్చి, సిగ్గుపడుతూ అంది; "క్రమంగా మూడు నెలలు గడిచినై... ఈ గర్భంలో– శిశువు..." అని ఇంక చెప్పలేక వెక్కి వెక్కి ఏడ్వనారంభించింది.

"ఏడుస్తావెందుకు శ్రీ?" అన్నాడు ఓదార్చుతూ.

"మధూ! ఇన్నాళ్ళూ తెల్సుకోలేక పొయ్యాను... ఇంతకుముందే హరి పాదాలమీద పడి, క్షమించి వివాహమాడమన్నాను. అతను ఒప్పుకోలేదు. శిశువు సంగతి అడిగాను.... కావాలంటే గర్భస్రావానికి మందులు తెచ్చి ఇస్తాడట! ఎంత క్రూరంగా నన్ను గదిబైటికి గెంటాడనుకొన్నావ్!... మధూ! నన్నెవరు క్షమిస్తారు? నాచేత తప్పులు చేయించిన వ్యక్తే నన్ను క్షమించలేకపొయ్యాడు..."

మధు ఆలోచనలోపడ్డాడు. తను మాట ఇచ్చాడు– క్షమిస్తానని! క్షమ! ఎలా భరించగలడు– యీ భార్యను? కాని– భార్యను? కాని– తనను నమ్మి, తనపైన జీవిత భారమంతావేసి నిజాన్ని బైట పెట్టింది! ఆమెకు నిజం తెలుసుకొన్న తనేనా అన్యాయం చేయాల్సింది? లోకంలో ఎక్కడా తావులేని ఆమెకు– తనెందుకు శరణ మివ్వకూడదు?

"ఇదంతా చెప్పకుండానే నీకు భార్యనై నిన్ను మోసం చెయ్యటం నాపని కాదు మధూ! ఆ పాపపు బాధ నన్ను జీవితాంతంవరకూ విడువదు. నీతో నమ్మకంగా కాపరం చేస్తూ ఆ హరిశిశువును ఎల్లా ముద్దాడగలను? ఇదంతా యీ చిన్ని హృదయంలో ఎన్నాళ్ళు దాయగలను? ఈ కులటను, పాపిని క్షమిస్తావా మధూ?"

పెద్దపెట్టున ఏడుస్తోంది. మధుకు ఇది అగ్నిపరీక్షయింది. శ్రీ కావాలని తను ఆరాటపడే క్షణాలూ, ఆమెతో తను, భర్తయిచేసే పనుల వాగ్దానాలూ, ప్రమాణాలూ అన్నీ జ్ఞాపకమొచ్చినై.

“ఏమిటిది శ్రీ – మతిపోయిందా? ఇందులో ఏముందీ క్షమించేందుకు?... క్షమకు తావుందని భ్రమిస్తున్నావ్... నా నిర్ధారణను చెప్పనా?”

ఆమె ఇంకా ఆయాసపడుతూనే, వాడిన ముఖాన్ని పైకెత్తి, ఉరిశిక్ష పడబొయ్యే ఖైదీ– న్యాయాధికారి వైపు చూసే చూపుల్ని చూసింది.

మధు హేళనగా నవ్వుతూ, “నిన్నే పెళ్ళాడుతాను శ్రీ!” అన్నాడు.

కలా? నిజమా? భ్రమిస్తోందా? మధుకు పిచ్చి ఎక్కిందా? “నన్నా?... నన్నా?” అంది ఆశ్చర్యంతో.

“అవును శ్రీ! తప్పులు చెయ్యని మానవులెవరు? అందరూ పైకి చెప్పకుండా, జీవితంలో నటించి– బాధపడుతూనే సౌఖ్యమని భ్రమిస్తారు. కాని నువ్వు ధైర్యంగా ఒప్పుకున్నావ్! తప్పులు చేసేప్పుడుండే ధైర్యం – దాన్ని ఒప్పుకొనేప్పుడు చూపలేని పిరికిపందవు కావు నువ్వు! నన్ను నమ్మి నీ జీవిత సర్వస్వాన్నీ నా పాదాలముందుపడేసి నిరీక్షిస్తున్నావ్! నన్ను ఇంతగా నమ్మే వ్యక్తికన్న ఆప్తులు నా జీవితంలో ఎందుకుంటారు?”

“నిజమా– మధూ?”

“ముమ్మాటికీ నిజం! శ్రీ నాకు నేను నిర్ధారణ చేసుకోగలను. లోకం లిఖించి పడేసిన పాపాలన్నీ నా నిఘంటువులో లేవు. ఎందుకంటే మానవుడై పుట్టినవాడు పాపాలేమిటో తనకు తనే తెలుసుకోవటం ఉచితం ... ఎదుట వ్యక్తి తప్పును తెలుసుకున్నప్పుడేగా క్షమకు విలువ వచ్చేది! నువ్వు నా భార్యవు – నిన్ను అగౌరవించను–ఎందుకంటే నామీద నీకున్న నమ్మకం యీ లోకంలో ఇంకోరిమీద లేదు కనుక.”

“మరి– ఈ శిశువో?” అంది మెల్లిగా.

“ఉంటాడు... నాకు బిడ్డలంటే సరదా శ్రీ! అది నీ బిడ్డ. నీ మీద ఉండే భావమే నాకు నీ బిడ్డ మీద కూడా ఉంటుంది. ఈ కథంతా నేను విననట్లే భావించి జీవించగలను–”

ఆమె మళ్ళీ ఏడ్వనారంభించింది.

“శ్రీ! ఇంకెందుకు విచారం?” అన్నాడు గంభీరంగా.

“ఇది విచారం కాదు మధూ! నాకు జ్ఞానోదయ మయింది. ఈ క్షణాన నిర్ణయించుకోగలిగాను– నా భర్తను.”

"అంటే!"

"అంటే... ఇదివరకు నిన్నూ హరినీ పోల్చి చూచుకొని ఎవర్ని వివాహమాడటమో తెలియక బాధపడ్డాను. కాని యీ క్షణాన..."

"నాకు అర్థమవటం లేదు-"

ఆమె నవ్వుతూ, "చెప్పనా మధూ? నీకు చెప్పిన కథనే హరి పేరుకు బదులు నీ పేరును పెట్టి ఇంతకుముందే హరికి చెప్పాను. ఆ విశాలహృదయుడు నన్ను బైటికి గెంటేశాడు. మళ్ళీ స్వేచ్ఛా ప్రేమ సిద్ధాంతాల్నీ, సాంఘిక విప్లవ వ్యాసాల్నీ ఏకరువు పెడతాడు. కోట్లకిందా, విలువైన దుస్తులకిందా, అలంకారాల కిందా కనబడే సంస్కారం- సమయానికి మొహం తప్పిస్తుంది కాబోలు. ఈ అగ్ని పరీక్షకు నువ్వొక్కడివే ఆగగలిగావు-" అంది.

మధు ఆశ్చర్యంతో, "అంతా అబద్ధమేనా?" అన్నాడు.

"అవును- అబద్ధమాడి, నాటకంలో పాత్రలాగు దుఃఖాన్ని తెచ్చిపెట్టుకొని పాఠాన్ని అప్పగించినట్టు వాగాను. నువ్వు చలించలేదు-"

"శ్రీ- నా శ్రీ! నాకోసం ఇంత బాధపడ్డావ్ దేనికి?" అని ఆమెను లాలించాడు.

"బాధకాదు మధూ! నీ నీడచాటున నేను ఎన్ని జన్మాలైనా నివసించగలను-" అని నవ్వుతూ మధును ఆ క్షణానే భర్తగా గ్రహించింది.

- మార్చి, *1941*